## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 26-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

### ముఖ్యాంశాలు

- వికసిత్ భారత్‌ను నిర్మించడానికి 140 కోట్ల మంది భారతీయులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- దేశంలో కరోనా కేసుల తీవ్రత తక్కువగానే ఉందని (ICMR) డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ తెలియజేశారు.
- ఉగ్రవాదానికి మద్దతునిస్తూ పాకిస్తాన్ చేస్తున్న ప్రయత్నాలను భారత అఖిల పక్ష బృందాలు ప్రపంచవ్యాప్తంగా బహిర్గతం చేస్తున్నాయి.
- జర్మనీలో జరిగిన జూనియర్ ప్రపంచ కప్ లో భారత షూటర్ తేజస్వని స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది.
- నైరుతి రుతుపవనాల కారణంగా కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

==============================

వికసిత్ భారత్‌ను నిర్మించడానికి 140 కోట్ల మంది భారతీయులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే స్వావలంబన సాధించాలన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈరోజు గుజరాత్ చేరుకున్న ప్రధానమంత్రి దాహోద్‌లో దాదాపు 24 వేల కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన దేశీయ తయారీరంగం గురించి మాట్లాడుతూ భారతదేశంలో తయారు చేయబడిన రైల్వే భాగాలు ఇప్పుడు ఇంగ్లాండ్, ఫ్రాన్స్, మెక్సికో ,జర్మనీ వంటి దేశాలకు ఎగుమతి అవుతున్నాయన్నారు. అనంతరం ఆపరేషన్ సిందూర్ గురించి ప్రసంగిస్తూ... ఇది కేవలం సైనిక చర్య మాత్రమే కాదని, భారతీయుల భావోద్వేగాల వ్యక్తీకరణ అని అన్నారు.

[వాయిస్ బైట్...35 సెకన్లు]

ఆ తరువాత, ప్రధానమంత్రి గుజరాత్ లోని భుజ్‌కు వెళ్లి 53వేల 400 కోట్ల రూపాయల విలువైన 33 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.

==============================

రైతులు వ్యవసాయంతో పాటు తమ పంట ఉత్పత్తులకి సంబంధించిన వ్యాపారంపై కూడా దృష్టి సారించాలని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అన్నారు. అప్పుడు మాత్రమే రైతుల ఆదాయంలో మార్పు వస్తుందన్నారు. మధ్యప్రదేశ్‌లోని నర్సింగ్‌పూర్‌లో ఈరోజు జరిగిన మూడు రోజుల కృషి ఉద్యోగ సమ్మేళన్ ప్రారంభ సమావేశంలో ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ.. భారత ప్రభుత్వం రైతులకు రాయితీల రూపంలో సహాయం చేస్తోందని అన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి అనే పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సహాయం ఇస్తోందని, రాయితీపై ఎరువులను కూడా అందిస్తుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా కోవిడ్ పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని భారతీయ వైద్య పరిశోధనా మండలి(ICMR) డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ తెలియజేశారు. కోవిడ్ కేసులు పెరుగుతున్నప్పటికీ ప్రస్తుతానికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కేసుల తీవ్రత తక్కువగానే ఉందని ఆయన వివరిస్తూ...

[వాయిస్ బైట్...35 సెకన్లు]

మరోవైపు ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి పంకజ్ సింగ్ మాట్లాడుతూ, కరోనా గురించి భయపడాల్సిన అవసరం లేదని, ఎందుకంటే ఈ వేరియంట్ నెమ్మదిగా వైరస్ లాగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పుడు ఆసుపత్రులకు వస్తున్న రోగులు సాధారణ జలుబు-దగ్గు లక్షణాలను మాత్రమే కలిగి ఉన్నారని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడానికి పాకిస్తాన్ చేస్తున్న ప్రయత్నాలను భారతదేశం ప్రపంచవ్యాప్తంగా బహిర్గతం చేస్తోంది. అఖిలపక్ష బృందాల ప్రతినిధులు పలు దేశాలను సందర్శించి, జీరో టోలరెన్స్ విధానమే ఉగ్రవాదం పట్ల భారతదేశపు వైఖరి అని స్పష్టం చేస్తోంది. జనతా దళ్ యునైటెడ్ JD(U) పార్టీ ఎంపీ సంజయ్ కుమార్ ఝా నేతృత్వంలోని అఖిలపక్ష ప్రతినిధి బృందం ఈరోజు దక్షిణ కొరియాలోని సియోల్లో పలువురితో సమావేశమయ్యింది. పహల్గామ్ ఉగ్రవాద దాడిని ఉటంకిస్తూ గత 40 సంవత్సరాలుగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడమే పాకిస్తాన్ జాతీయవిధానంగా కొనసాగుతోందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు న్యూఢిల్లీలో భారత్ ఫోర్కాస్టింగ్ సిస్టమ్(BFS) ను ప్రారంభించారు. పూణేలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీరియాలజీ అభివృద్ధి చేసిన దీని ద్వారా 6 కిలోమీటర్ల రిజల్యూషన్ తో అత్యంత ఖచ్చితమైన సూచనలను అందిస్తుంది. ఈ నూతన వ్యవస్థ రుతుపవనాల ట్రాకింగ్, విమానయానం, విపత్తు నిర్వహణ, వ్యవసాయం, జలమార్గాలు, రక్షణ, వరదల అంచనాలలోఖచ్చితత్వాన్ని పెంచుతుందన్నారు. ఈ ముందస్తు వాతావరణ సమాచారంతో భారత దేశ ఆర్థిక వ్యవస్త కు కూడా ఇది దోహదపడుతుందని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ బైట్... 35సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా మూడు రోజుల పాటు మహారాష్ట్ర పర్యటనలో భాగంగా ఈరోజు ఉదయం నాగ్పూర్లోని జామ్తా లోని నేషనల్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్లో 'స్వస్తి నివాస్'కు శంకుస్థాపన చేశారు. మధ్యాహ్నం కాంప్టీ బ్లాక్లోని చిచోలి వద్ద నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ (NFSU) నాగ్పూర్ క్యాంపస్కు కూడా ఆయన శంకుస్థాపన చేశారు. చిచోలి గ్రామంలో 50 ఎకరాల భూమిలో నిర్మించబడుతున్న ఈ సంస్థ ఫోరెన్సిక్ సైన్స్ మరియు ఇతర విభాగాలలో 5 కోర్సులను అందిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో దాదాపు 15 విదేశీ విశ్వవిద్యాలయాలు ఈ విద్యా సంవత్సరంలో నూతన ప్రాంగణాలను ఏర్పాటు చేస్తాయని కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు, దీనికి సంబంధించిన ప్రభుత్వ అనుమతులు ఇప్పటికే మంజూరు చేశామని తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలోని బ్రిటన్ కి చెందిన లివర్పూల్ విశ్వవిద్యాలయానికి లెటర్ ఆఫ్ ఇంటెంట్ హ్యాండోవర్ కార్యక్రమంలో ధర్మేంద్రప్రధాన్ పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఈరోజుతో 11 సంవత్సరాలు పూర్తయ్యింది. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో మొదటిసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం

చేసిన ఆయన ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో కూడా వరుసగా ఎన్డీయే కూటమి గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో గత మూడు పర్యాయాలుగా నరేంద్ర మోదీ ప్రధానమంత్రి పదవిలో కొనసాగుతున్నారు.

==============================

నైరుతి రుతుపవనాల కారణంగా కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే భారత వాతావరణ శాఖ ఆ రాష్ట్రంలోని మొత్తం 11 జిల్లాల్లో తీవ్ర ప్రమాదపు హెచ్చరికలు జారీ చేసింది. తిరువనంతపురం, కొల్లం, అలప్పుజ జిల్లాలు తప్ప మిగిలిన అన్ని జిల్లాల్లో రాబోయే 24 గంటల్లో 20 సెం.మీ. కంటే ఎక్కువ వర్షపాత నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఇక కేరళ తీరం వెంబడి గంటకు 35 నుంచి 45 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయని దీంతో అలప్పుజ, ఎర్నాకులం, కన్నూర్, కాసరోడ్, కొల్లం, కోజికోడ్, మలప్పురం, త్రిస్సూర్ తీర ప్రాంతాల ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకూడదని సూచించారు.

==============================

జర్మనీలోని సుహ్లో లో జరిగిన జూనియర్ ప్రపంచ కప్ లో భారత షూటర్లు రాణిస్తున్నారు. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ తేజస్వని స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఎనిమిది మంది మహిళలు పాల్గొన్న ఫైనల్స్ లో తొలి ఐదు రౌండ్లలోనూ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించిన తేజస్వని 31 పాయింట్లు సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కాగా.. ఇప్పటికే భారత షూటర్లు శంభవి క్షీర్సాగర్, ఓజస్వి ఠాకూర్ స్వర్ణం, రజత పతకాలు గెలుచుకున్నారు.

==============================

తెలంగాణాలోని కాళేశ్వరంలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న సరస్వతి నది పుష్కరాలు ఈరోజుతో ముగిశాయి. ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన పుష్కరాలు చివరి రోజు సోమవారం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో వచ్చి త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు.

==============================
==============================